


# అబల కాదు తాను సబల..

హైదరాబాద్ చరిత్రలో ఒక కమిషనరేట్‌కు నేతృత్వం వహిస్తున్న తొలి మహిళా కమిషనర్
సీనియర్ ఐపీఎస్ అధికారిణి సుమతి పై విజన్ ఆంధ్ర ప్రత్యేక కథనం..

**హైదరాబాద్, మే 14 (విజన్ ఆంధ్ర) :** అబల కాదు తాను సబల,అడుగు అడుగున అడ్డంకులు ఎదురైనా ఆత్మ విశ్వాసమే ఆమె ఆయుధం, ఆమె ఓర్పు సముద్రం, ఆమె ప్రేమ అనంతం, తల వంచేది కాదు, విలువలు గాడి తప్పిన వారిని గాడిలో పెట్టే సబల, హైదరాబాద్ పోలీస్ మహిళా తొలి కమిషనర్‌గా చరిత్ర సృష్టించిన సుమతి ఐపీఎస్, హైదరాబాద్ పోలీసు చరిత్రలో గొప్ప మైలురాయి



- అడ్డంకులు ఏవైనా ఆత్మ విశ్వాసమే ఆమె ఆయుధం..
- ఆమె ఓర్పు సముద్రం, ఆమె ప్రేమ అనంతం..
- తల వంచేది కాదు ఖాకి చొక్కా విలువను ప్రపంచానికి చాటే అవని..

నమోదు చేసింది.

బడుగుల సుమతి ఐపీఎస్ మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళగా చరిత్ర సృష్టించారు. ఆమె నియామకం తెలంగాణ పోలీస్ వ్యవస్థలో ఒక కొత్త దిశగా నిలిచింది. గతనెల 24న జరిగిన ఐపీఎస్ అధికారుల బదిలీలలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం సుమతిని మల్కాజిగిరి కమిషనర్‌గా నియమించింది. దాదాపు రెండు శతాబ్దాల చరిత్ర కలిగిన హైదరాబాద్ పోలీస్ వ్యవస్థలో మహిళా నాయకత్వానికి ఇది ఒక గొప్ప గుర్తింపు. ఐపీఎస్ అధికారి అయిన సుమతి తన సేవా ప్రయాణాన్ని 2001లో గ్రూప్ వన్ లో డీఎస్పీగా ప్రారంభించి, అంతకుముందు కమిషనర్‌గా ఉన్న అవినాష్ మహంతి స్థానంలో బాధ్యతలు చేపట్టారు. సుమతి రాకతో ఖాకీ వ్యవస్థలో మానవీయ దృక్పథం, నూతన ఆలోచనలకు ప్రాధాన్యం పెరుగుతుందని ప్రజలు భావిస్తున్నారు.










### ఇంటెలిజెన్స్‌లో విశేష సేవలు :

మల్కాజ్గిరికి ముందుగా సుమతి స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్రాంచ్ ఎస్ఐబిలో ఐజీగా పని చేశారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో ఆమె చర్చల ద్వారా సమస్యలను పరిష్క రించడంలో కీలక పాత్ర పోషించారు. రెండు సంవత్స రాల్లో అనేక మంది మావోయిస్టుల లొంగుబాటుకు దోహదం చేయడం ఆమె జీవితంలో ఒక గొప్ప విజయంగా నిలిచి ఎందరి ప్రశంశలనో చూరగొన్నారు. ఈ ఏడాది ప్రముఖ మావో యిస్టు నాయకుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవుజి, లొంగు బాటుకు ఆమె చేసిన చర్చలు దేశ వ్యాప్తంగా అత్యంత ప్రాము ఖ్యంగా నిలిచాయి. యూనిఫాం వెనుక మనసు ఉంటుంది అనే భావనతో ఆమె నమ్మకాన్ని పెంచుతూ, శాంతి స్థాపనలో కీలకంగా పని చేశారు.

### టెక్నాలజీ వినియోగంలో ముందంజ..

మరోవైపు ఇటీవల జగిరిన మేడారం జాతర సమయంలో భారీ జన సందోహాన్ని నియం త్రించేందుకు ఆధారిత డ్రోన్ టెక్నాలజీను వినియోగించి, ఆధునిక పోలీసింగ్‌కు నాంది పలికారు. మహిళా భద్రతపై దృష్టి, సీఐడీ మహిళా రక్షణ విభాగంలో డీఐజీగా పనిచేసి షీ టీమ్స్ కార్యక్రమాన్ని బలోపేతం చేస్తూ మహిళల భద్రతకు ప్రాధాన్యం ఇచ్చారు.

### ప్రస్తుతం కమిషనర్ సుమతి ముందు ఉన్న సవాళ్లు...



మల్కాజ్గిరి ప్రాంతం పట్టణ విస్తరణ, సంక్లిష్ట జనాభా నిర్మాణంతో ప్రత్యేక సవాళ్లను ఎదుర్కొంటోంది. అయితే సుమతి సహనం చర్చల నైపుణ్యం, ఈ సవాళ్లను అధిగ మించడంలో సహాయ పడతాయని అధికారులు ప్రగాఢంగా విశ్వసిస్తున్నారు.

### సమగ్ర సందేశం...

సుమతి నియామకం తెలంగాణ ప్రభుత్వ దృష్టిలో సమానత్వం, తెలివైన మానవీయ పోలీసింగ్‌కు సంకేతంగా మహిళలు కూడా ఉన్నత స్థాయిలో నాయకత్వం వహించగలరని బలమైన నమ్మకం.

# అద్భుతాలు సృష్టించండి.. మిమ్మల్ని ఆపే వారే ఉండరు..

- విద్యార్థుల భవిష్యత్తు నిర్మిస్తేనే మీకు భవిష్యత్తు..
- షాద్ నగర్ మంచిర్యాంకుల పంట పండాలి..
- నా అండ మీకు ఎప్పుడూ ఉంటుంది..
- షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..
- షాద్ నగర్ లో విట్జీ డాక్టర్స్ అకాడమీ, కళాశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే..
- షాద్ నగర్ లో తొలిసారిగా ఐఐటి జేఈఈ, నీట్, సీఏలలో శిక్షణ..
- తక్కువ ఫీజులతో నాణ్యమైన విద్య: సీనియర్ జర్నలిస్టు మారం శ్రీనివాస్
- హాజరైన తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మెన్ ప్రొఫెసర్ బాలకృష్ణ రెడ్డి







రంగారెడ్డి బ్యూరో, మే14(విజన్ ఆంధ్ర): విద్యార్థులలో విజ్ఞానాన్ని వెలికి తీసి అద్భుతాలు సృష్టించండి..షాద్ నగర్ నియోజకవర్గం నుంచి ర్యాంకుల పంట పండించండి.. అప్పుడు మిమ్మల్ని ఎవరూ ఆపలేరు.. విద్యార్థుల భవిష్యత్తు నిర్మించడం పైనే మీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది.. అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.షాద్ నగర్ పట్టణంలోని పాత జాతీయ రహదారిపై యమ్మీ బేకరి వెనుక భాగంలో విట్జీ డాక్టర్స్ అకాడమీ ఆధ్వర్యంలో బ్రిడ్జి జూనియర్ కళాశాల సీనియర్ జర్నలిస్టు మారం శ్రీనివాస్, ఇతర డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కళాశాలను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు.షాద్ నగర పరిధిలో మొదటిసారిగా ఐఐటీ జేఈఈ, నీట్, సి ఎ లలో శిక్షణ ఇస్తూ ముందుకు తీసుకు వస్తున్న ఈ కళాశాల ప్రారంభోత్సవానికి మంత్రి శ్రీధర్ బాబు రావాల్సి ఉండగా అనివార్య కారణాలవల్ల ఆయన కార్యక్రమం రద్దయింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కళాశాలను ప్రారంభించారు. అదేవిధంగా కళాశాలలో జేఈఈ, నీట్, సీఏలకు సంబంధించిన గదులను కూడా ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల నిర్వహకులు ఆయనతోపాటు మున్సిపాలిటీ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందెమోహన్, పట్టణ అధ్యక్షుడు నల్లమోని శ్రీధర్, కౌన్సిలర్ పెంటయ్య, చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్ తదితరులను సత్కరించారు.

## అక్షరంతోనే అభ్యుదయం..

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్..**

ఆధునిక యుగంలో విద్యను మించింది ఏది లేదని, అక్షరంతోనే అభ్యుదయాన్ని సాధించవచ్చు అని, అద్భుతాలు సృష్టించవచ్చు అని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వీట్జీ కళాశాల ప్రారంభోత్సవం అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యలో మార్పులకు శ్రీకారం చుడుతూ అత్యాధునిక సదుపాయాలతో రాజధాని తరహాలో వివిధ ఉన్నత కోర్సులలో శిక్షణను ఇచ్చేలా కళాశాలను తీర్చిదిద్దడం సంతోషకరమని అన్నారు. విద్యా రంగంలో ఎక్కువ శాతం నారాయణ, చైతన్య లాంటి పేర్లు వినిపిస్తాయని, అలాంటిది స్థానికంగా కూడా విజ్ఞానవంతులైన అధ్యాపకులు ఎలాంటి కళాశాలలు ఏర్పాటు చేసి వాటికి దీటుగా ముందుకు నడిపించడం అభినందనీయమని అన్నారు. ఈ ప్రాంతంలో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్ది వారి భవిష్యత్తును నిర్మించే దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలో విద్యను సాధిస్తే ఏమైనా సాధించవచ్చని నిరూపించిన అబ్దుల్ కలాం లాంటి వ్యక్తులను విద్యార్థులకు ఆదర్శంగా చూపాలని అన్నారు. కళాశాల నిర్మాణం, సదుపాయాలు బాగున్నాయని, ఫీజులు కూడా అందుబాటులో ఉన్నాయని ప్రశంసించారు. అధ్యాపకులు కష్టపడి ఒక్కసారి మంచి ఫలితాలను సాధించగలిగితే ఆ పేరు ఎప్పటికీ చిరస్థాయిగా ఉండిపోతుందని అన్నారు. మంచి ఆలోచనతో ఒక సంకల్పంతో ముందుకు వచ్చిన అధ్యాపకులు మంచి ఫలితాలు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. విద్యారంగానికి సహకారం అందించేటందుకు తాను ఎప్పుడు ముందుంటానని, ఇక్కడ కూడా నిర్వాహకులకు ఇలాంటి సహకారం అవసరమైన తన నుంచి లభిస్తుందని స్పష్టం చేశారు. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు బంగారాలు అమ్మడానికి కూడా వెనకాడరని, అలాంటి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాల్సిన బాధ్యత అధ్యాపకుల పై ఉందని స్పష్టం చేశారు. అద్భుతమైన ఫలితాలతో షాద్ నగర్ కు గుర్తింపు తీసుకురావాలని కోరారు.

## అందుబాటులోకి శిక్షణ..


**కళాశాల డైరెక్టర్ ,సీనియర్ జర్నలిస్టు మారం శ్రీనివాస్..**

ఐఐటి, నీట్ వంటి వాటిలో శిక్షణ పొందేందుకు షాద్ నగర్ వాసులు, ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులు ఎంతో దూరంలో ఉన్న హైదరాబాదుకు వెళ్లాల్సి వస్తుందని, అక్కడ హాస్టల్లో భోజనాలు పడక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కళాశాల డైరెక్టర్, సీనియర్ జర్నలిస్టు మారం శ్రీనివాస్ అన్నారు. అలాంటి విద్యార్థుల అవస్థలు గుర్తించి వారి కోసమే ఈ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. బయట మూడు నుంచి నాలుగు లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని, ఇక్కడ మాత్రం కేవలం 1,30 వేలకే మెటీరియల్ తో సహా శిక్షణ ఇవ్వడం జరుగుతుందని వెల్లడించారు. నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన స్పష్టం చేశారు. మంచి ఫలితాలను అందించి షాద్ నగర్ వాసులలో కళాశాల పట్ల నమ్మకం కలిగిస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే 150 అడ్మిషన్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, సీనియర్ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, రఘునాయక్, రాయికల్ శ్రీనివాస్, చంద్రశేఖర్, నల్లమోని శ్రీధర్, చిట్టెం దామోదర్ రెడ్డి, విక్రమ్ రెడ్డి, ఎర్రోళ్ల అశోక్, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, ర్యాకల శ్రీను, కళాశాల డైరెక్టర్లు అధ్యాపకులు మారం చందు, మాజీ ఎంపీటీసీ చంద్రపాల్ రెడ్డి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. కళాశాల యజమాన్య సభ్యులు మారం శ్రీనివాస్ , ప్రభాకర్ రెడ్డి , ప్రవీణ్ , దేవేందర్ రెడ్డి , మారం చందు , శ్రీశైలం , యోగేందర్ , ఆంజనేయులు , అహ్మద్ పాషా, నవనీత తదితరులు పాల్గొన్నారు..

# మోడీ మితవ్యయ మంత్రం!!

- దేశం కోసం పొదుపు.. దుబారాకు బ్రేక్
- వర్క్ ఫ్రమ్ హోమ్‌కు ప్రాధాన్యం
- ప్రభుత్వంలోనూ కొత్త విధానాల ఆలోచన
- పెట్రోల్, డీజిల్ వినియోగం తగ్గిద్దాం
- ప్రజలకు ప్రధాని కీలక సూచనల వెనుక మతలబ్




**రామగుండం, మే 14 (విజన్ ఆంధ్ర) :** ప్రస్తుత ప్రపంచ యుద్ధ పరిస్థితులు, అంతర్జాతీయ ఆర్థిక అస్థిరతల నేపథ్యంలో దేశ ప్రజలు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన సూచనలు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారాయి. దేశ ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ఒత్తిడి, ఇంధన దిగుమతుల భారం, విదేశీ మారక ద్రవ్య వినియోగం పెరుగుతున్న పరిస్థితుల్లో ప్రతి పౌరుడు పొదుపు దిశగా అడుగులు వేయాల్సిన అవసరం ఏర్పడిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ప్రధాని మోడీ చేసిన సూచనల్లో ముఖ్యంగా పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునివ్వడం ప్రాధాన్యత సంతరించుకుంది. అవసరం లేని ప్రయాణాలను తగ్గించడం, ఒకే వాహనంలో పలువురు కలిసి ప్రయాణించడం, ప్రజా రవాణా వ్యవస్థను ఎక్కువగా వినియోగించడం వంటి చర్యలు దేశానికి మేలు చేస్తాయని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ఇంధన దిగుమతులపై ఆధారపడుతున్న భారతదేశానికి ఇది విదేశీ మారకద్రవ్యాన్ని ఆదా చేసే మార్గంగా భావిస్తున్నారు.

అలాగే ప్రైవేట్, ప్రభుత్వ రంగాల్లో సాధ్యమైన చోట "వర్క్ ఫ్రమ్ హోమ్" విధానాన్ని ప్రోత్సహించాలని సూచించడం కూడా విశేషం. కరోనా సమయంలో ఈ విధానం ఎంతగానో ఉపయోగపడిన నేపథ్యంలో, మళ్లీ అవసరాన్ని బట్టి ఈ తరహా విధానాలను అమలు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఉద్యోగులు ఇంటి నుంచే పని చేస్తే ట్రాఫిక్, ఇంధన వినియోగం తగ్గడమే కాకుండా కార్యాలయ నిర్వహణ ఖర్చులు కూడా తగ్గే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

దేశవ్యాప్తంగా దుబారా ఖర్చులను తగ్గించాల్సిన అవసరాన్ని కూడా ప్రధాని ప్రస్తావించడం గమనార్హం. విద్యుత్, నీటి వినియోగం నుంచి వివాహాలు, వేడుకల వరకు ప్రతి అంశంలో మితవ్యయాన్ని అలవాటు చేసుకోవాలని సూచనలు వస్తున్నాయి. తాత్కాలికంగా కొన్ని ఇబ్బందులు ఎదురైనా దేశ ప్రయోజనాల కోసం ప్రజలు సహకరించాలని పిలుపునిస్తున్నారు.

ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న పరిస్థితుల్లో ప్రభుత్వంతో పాటు ప్రజలు కూడా భాగస్వాములైతేనే ఆర్థిక స్థిరత్వాన్ని కాపాడుకోవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. "పొదుపు చేసిన ప్రతి రూపాయి దేశానికి బలం" అనే భావనతో ప్రజలు ముందుకు వస్తే, సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కొనే శక్తి భారత్‌కు మరింత పెరుగుతుందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## విపత్తుల నిర్వహణపై పకడ్బందీగా కసరత్తు చేయాలి

**- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్**



వనపర్తి జిల్లా ప్రతినిధి, మే 14 (విజన్ ఆంధ్ర) - భవిష్యత్తులో ఎలాంటి విపత్తులు వచ్చిన సమర్థవంతంగా ఎదుర్కోడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండేందుకు ఆయా శాఖలు ప్రాథమిక కసరత్తు పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎన్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. భవిష్యత్తులో వచ్చే పర్యావరణ విపత్తులను ఏవిధంగా ఎదుర్కోవాలి ఎలా సన్నద్ధం కావాలి అనే అంశాల పై కేంద్ర, రాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖలు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల ద్వారా టేబుల్ ప్రాక్టీస్ చేయడం, మాక్ డ్రిల్ చేయడం వంటి ముందస్తు శిక్షణ ఇస్తుంది. ఇందులో భాగంగా గురువారం జిల్లా ఎస్పీ రాజేష్ మీనా తో కలిసి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులతో ప్రాథమిక సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో అకస్మాత్తుగా వచ్చే పర్యావరణ విపత్తులను జిల్లా యంత్రాంగం ఏ విధంగా ఎదుర్కొంటుంది అనేదానిపై అన్ని శాఖలు తమ ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకొని మే, 15వ తేదీన కలెక్టరేట్ కు రావాలని, ఉదయం 9.00 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు తమ తమ కార్యాచరణను టేబుల్ వర్క్ ద్వారా విషాదీకరించాల్సి ఉంటుందన్నారు. మే 18వ తేదీన విపత్తు వచ్చినప్పుడు ప్రజల ప్రాణ నష్టాన్ని నివారించేందుకు తమ శాఖ ఏవిధంగా పనిచేస్తుందో మాక్ డ్రిల్ ద్వారా ప్రదర్శనలు ఇవ్వాల్సి ఉంటుందన్నారు. మాక్ డ్రిల్ నిర్వహించేందుకు వనపర్తి జిల్లాలో 7 ప్రాంతాలను గుర్తించడం జరిగిందని, మే 18న సదరు శాఖ సిబ్బంది స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఎలా అమలు చేస్తారో మాక్ డ్రిల్ ద్వారా ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. ఈ మాక్ డ్రిల్ ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పర్యావరణ విపత్తు విభాగాల అధికారులు ఆన్లైన్ ద్వారా పరిశీలిస్తారని చెప్పారు. జిల్లా ఎస్పీ రాజేష్ మీనా మాట్లాడుతూ జిల్లాలో అకస్మాత్తుగా భారీ వర్షాలతో వరదలు రావడం, పరిశ్రమల్లో భారీ అగ్ని ప్రమాదాలు జరగటం, అడవుల్లో మంటలు చెలరేగడం, రోడ్డు, రైలు ప్రమాదాలు జరిగినప్పుడు జిల్లా యంత్రాంగం ఏ విధంగా వ్యవహరించాలి, ప్రాణ నష్టం జరుగకుండా, క్షతగాత్రులను ఏ విధంగా రక్షించాలి అందుకు కమ్యూనికేషన్ వ్యవస్థ ఏవిధంగా ఉండాలి అనేది ఒక ముందస్తు ప్రణాళిక ఉండాలని అప్పుడే ప్రాణ నష్టాలను నివారించవచ్చు అన్నారు. మాక్ డ్రిల్ ఎంత బాగా చేస్తే ఆత్మ విశ్వాసం అంతగా పెరుగుతుందని తెలిపారు. మాక్ డ్రిల్ అనేది నిజంగా విపత్తు వచ్చినట్లు, దానిని నివారించేందుకు సిబ్బంది చేసే కృషి కళ్ళకు కట్టినట్టు ఉండాలని సూచించారు. సి.పి. ఒ హరికృష్ణ, జిల్లా ఫైర్ ఆఫీసర్ బి. ధర్మ, డీఎస్పీ బాలాజీ నాయక్ , డీఎస్పీ గిరిబాబు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.